సాక్షి మహబూబాబాద్

శుక్రవారం | 2 | జూన్ | 2023



దైవ దర్శనానికి వెళ్తూ..

శ్రీకాళహస్తి దైవక్షేత్రాన్ని దర్శించుకోవడానికి వెళ్తుండగా ఆర్టీసీ బస్సును కారు ఢీకొని జిల్లాకు చెందిన ముగ్గురు మృతి చెందారు.

- 8లో



మావోయిస్టు కొరియర్ల అరెస్ట్

వాజేడు మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామ సమీపంలో మావోయిస్టు కొరియర్లను పోలీసులు అరెస్ట్ చేసి పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు.

- 8లో

గరిష్టం/కనిష్టం
41.9°/25.8°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మంత్రి సత్యవతి చేతుల మీదుగా పతాకావిష్కరణ

సాక్షి, మహబూబాబాద్‌: గతంలో మాదిరిగా ఈ సారి కూడా రాష్ట్ర అవతరణ వేడుకలకు జిల్లా ముఖ్య అతిథిగా రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను పేర్కొంటూ సీఎస్‌ శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయం జిల్లా కలెక్టర్‌ శశాంక, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌కు తెలుపుతూ.. గౌరవ వందనం, పతాకావిష్కరణకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం



నెహ్రూసెంటర్‌: ప్రజలు హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌ శ్రీనివాసరావు అన్నారు. సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. హెచ్‌ఐవీపై అవగాహన పెంచుకుంటూ సంపూర్ణ సురక్ష కేంద్రం సేవలను వినియోగించుకోవాలని సూచించారు. వ్యాధి సోకిన వ్యక్తులు రెగ్యులర్‌గా మందులు వాడాలన్నారు. సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్‌ రమేష్‌ మాట్లాడుతూ.. సురక్ష కేంద్రం సేవలను పొందుతూ సంపూర్ణ ఆరోగ్యం పొందాలన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్‌ వెంకటేశ్వర్లు, డిప్యూటీ సూపరింటెండెంట్‌ లకావత్‌ వెంకట్‌, ఆర్‌ఎంఓ వైదేహి, ఐసీటీసీ కౌన్సిలర్‌ రమేష్‌, కుమారస్వామి, సరస్వతి, ఎల్‌టీ రమేష్‌, శాంతరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు దశాబ్ది ఉత్సవాల శుభాకాంక్షలు

మహబూబాబాద్‌: జిల్లా ప్రజలకు మంత్రి సత్యవతిరాథోడ్‌ తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌ పాలనలో ఎంతో అభివృద్ధి సాధించామని, బంగారు తెలంగాణే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. ప్రజల సహకారంతో ముందుకెళ్తున్నామన్నారు. అభివృద్ధిలో పాలుపంచుకున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ప్రజలకు కలెక్టర్‌ శశాంక ఒక ప్రకటనలో దశాబ్ది ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్‌: జిల్లాలో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిక్‌ హబ్‌ఫర్‌ ఎంపవర్మెంట్‌ ఆఫ్‌ ఉమెన్‌ సంస్థలో కాంట్రాక్ట్‌ పద్ధతిలో మార్చి 2026వరకు విధులు నిర్వర్తించడానికి దరఖాస్తు చేసుకోవాలని డీడబ్ల్యూఓ వరలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మిషన్‌ కోఆర్డినేటర్‌ పోస్టు, స్పెషల్‌ ఇన్‌ ఫైనాన్స్‌ లిట్రసీ పోస్టు, మల్టీ టాస్కింగ్‌ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తిగల వారు ఆన్‌లైన్‌ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. పూర్తి వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మార్కెట్‌కు మూడు రోజులు సెలవు

మహబూబాబాద్‌ రూరల్‌: మహబూబాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు ప్రకటించామని చైర్మన్‌ కత్తెరసాల విద్యాసాగర్‌ గురువారం తెలిపారు. శుక్రవారం తెలంగాణ అవతరణ దినోత్సవం, శని, ఆదివారాలు వారాంతపు సెలవుల కారణంగా మార్కెట్‌ బంద్‌ ఉంటుందన్నారు. రైతు సోదరులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

రైతులను మోసం చేస్తున్న కేసీఆర్‌ ప్రభుత్వం



నెల్లికుదురు: సీఎం కేసీఆర్‌ ప్రభుత్వం ధాన్యం రైతులను మోసం చేస్తోందని కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్‌ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన స్థానిక కాంగ్రెస్‌ నాయకులతో కలిసి పరిశీలించారు. రైతుల పరిస్థితిని అడిగి తెలుసుకుని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలలుగా కాంటాలు పెట్టి ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించకుండా రైతులను ఇబ్బందులు పెట్టడం సరికాదని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. మిల్లులు నిండిపోయాయని అధికారులు సాకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. త్వరగా ధాన్యం బస్తాలను తరలించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కళ్లముందే అభివృద్ధి



ఉద్యమాల కోటలో అభివృద్ధికి బాటలు

- మానుకోట రూపురేఖలు మారాయి
- సీఎం కేసీఆర్‌ పాలనలో అనూహ్య ప్రగతి
- గిరిజనులకు సేవ చేసే అవకాశం వచ్చినందుకు గర్వపడుతున్నా..
- పరిశ్రమలతో నిరుద్యోగ సమస్యకు పరిష్కారం
- దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో సాక్షితో మంత్రి సత్యవతిరాథోడ్‌

సాక్షి, మహబూబాబాద్‌: 'మానుకోట.. ఉద్యమాల కోటగా పేరుగాంచింది. నాటి తెలంగాణ సాయుధ పోరాటం మొదలుకొని, భూమి కోసం, భుక్తి కోసం జరిగిన ఉద్యమాలకు బాటలు వేసిన పోరు నేల ఇది. మలిదశ తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిన చరిత్ర. అలుపెరుగని ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన పోరులో మానుకోట విద్యార్థులు, నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు. తెలంగాణ సాధన ఫలాలు అందరికీ అందుతున్నాయి. మానుకోట రూపురేఖలు మారాయి. స్వరాష్ట్రంలో సాధించిన ప్రగతి కళ్లముందే కనిపిస్తుంది. తెలంగాణ వస్తే ఏం వస్తుందని అన్నోళ్లకు జరిగిన అభివృద్ధే సాక్ష్యం ' అని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్‌ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో ఇప్పటి వరకు సాధించిన ప్రగతి.. లక్ష్యాలపై గురువారం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు.

సాక్షి: ప్రత్యేక రాష్ట్రంలో మానుకోట జిల్లాకు కలిగిన ప్రయోజనం ఏమిటి?

మంత్రి: పరాయి పాలనలో నిర్లక్ష్యానికి గురైన ప్రాంతం మానుకోట. అందుకోసమే ఇక్కడి ప్రజల స్వరాష్ట్ర ఆకాంక్ష నినాదం ఉవ్వెత్తున ఎగిసింది. ప్రజలకు ప్రభుత్వ అధికారులు దూరంగా ఉండేవారు. తమ విన్నపాలు చెప్పాలంటే రెండు రోజులు వరంగల్‌లో మకాం వేయాల్సి వచ్చేది. ఈ అంతరాన్ని తగ్గించేందుకే మారుమూల మానుకోటను జిల్లాగా మార్చారు. ప్రజలకు పాలకులను దగ్గర చేశారు. ఇదే తొలి ఫలితం. దీనికి అనుగుణంగానే జిల్లాలో అనేక మార్పులు వచ్చాయి. జిల్లా స్వరూపం మారిపోయింది.

సాక్షి: వ్యవసాయ, వైద్యం, విద్యా రంగాల్లో జరిగిన మార్పులేమిటి?

మంత్రి: జిల్లా ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. అతివృష్టి, అనావృష్టితో రైతులు ఇబ్బందులు పడేవారు. సాగునీటి ఇబ్బందులు, విద్యుత్‌ కోతలతో రైతుల కష్టాలు వర్ణనాతీతం. అందుకోసమే సీఎం కేసీఆర్‌ ముందుచూపుతో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌ నీటితో మానుకోట మాగాణి పారుతోంది. గతంలో 60వేల ఎకరాలు ఉన్న వరి సాగు ప్రస్తుతం 2.12లక్షల ఎకరాలకు చేరింది. వైద్య సేవలు మెరుగయ్యాయి. ప్రభుత్వ మెడికల్‌ కళాశాల ఏర్పాటు చేసుకున్నాం. 330 పడకల ఆస్పత్రి నిర్మించుకొని 130మంది వరకు డాక్టర్ల పర్యవేక్షణలో ఆస్పత్రిలో సేవలు అందుతున్నాయి. ప్రసవాలు, వైద్యసేవలు పెరిగాయి. విద్యారంగంలో కూడా అనేక మార్పులు వచ్చాయి. ఎస్టీ, ఎస్సీ, ఏకలవ్య, బీసీ, మైనార్టీ గురుకులాలు, కేంద్రియ విద్యాలయం ఇలా అనేకం ఇక్కడి పిల్లలకు అందుబాటులోకి వచ్చాయి.

సాక్షి: తెలంగాణకు ముందు, ఆ తర్వాత మానుకోటను ఎలా చూడవచ్చు?

మంత్రి: తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత మానుకోటలో వచ్చిన మార్పులను ప్రజలు గమనిస్తున్నారు. జిల్లాలో 18 మండలాలు, రెండు రెవెన్యూ డివిజన్లతో పాలన సులభతరం చేశాం. ఇంతటితో ఆగకుండా మరిపెడ, తొర్రూరు, డోర్నకల్‌ పట్టణాలను మున్సిపాలిటీలుగా మార్చాం. పల్లె, పట్టణ ప్రగతితో పాటు, ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులతో పట్టణాల రూపురేఖలు మార్చాం. గత పది సంవత్సరాలకు ముందు మానుకోట.. ఇప్పటి మానుకోటకు తేడా స్పష్టంగా కనిపిస్తుంది. ఎంతో మార్పు వచ్చిందని నాకే ఫోన్‌ చేసి చెప్పిన వారు కూడా ఉన్నారు.

సాక్షి: మీరు మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాకు ఏం చేశారు?

మంత్రి: సాధారణ గిరిజన కుటుంబంలో పుట్టిన నాకు ఎమ్మెల్సీగా, మంత్రిగా పదవులు ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటా. గిరిజన బిడ్డగా నాకు జన్మనిచ్చిన, రాజకీయ భవిష్యత్‌కు బాటలు వేసిన జిల్లాను మర్చిపోను. అనునిత్యం జిల్లా, జిల్లాలోని గిరిజన బిడ్డల అభివృద్ధి కోసమే నా ఆరాటం. అందుకోసమే ప్రభుత్వ మెడికల్‌ కళాశాల తీసుకురావడం, ఇక్కడి బిడ్డలకు ఖరీదైన వైద్యం కూడా ఉచితంగా అందించేలా ఆస్పత్రిని తీర్చిదిద్దాం. తండాలు పంచాయతీలుగా ఆవిర్భావం, మారుమూల ప్రాంతాలకు కూడా అభివృద్ధి ఫలాలు అందుతున్నాయి. విద్య, వైద్యం, రోడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పన ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో పథకాలు, పనులు చేసే అవకాశం వచ్చింది.

సాక్షి: గిరిజన, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రిగా పనిచేయడంలో సంతృప్తిని ఇచ్చిన అంశాలేంటి?

మంత్రి: నేను గిరిజన మహిళను. పేదల కష్టాలు తెలిసినదాన్ని. గిరిజనులకు సేవ చేయాలనే తపన చూసిన కేసీఆర్‌ నాకు ఆశాఖలు అప్పగించారు. ఇది నా దేవుడు(ముఖ్యమంత్రి కేసీఆర్‌) ఇచ్చిన అవకాశం. గిరిజన బిడ్డగా గిరిజనుల కోసం పాటుపడుతున్నా. 10శాతం రిజర్వేషన్‌ అమలు, త్వరలో పోడు భూముల పట్టాలు పంపిణీ చేస్తాం. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల కోసం అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేశాం. గర్భిణులకు క్రమం తప్పకుండా బలవర్ధకమైన ఆహారం అందించి.. పండంటి బిడ్డలను కనే వరకు అన్ని సౌకర్యాలు కల్పించాం. ఇలా ఒకవైపు గిరిజనులకు, మరో వైపు మహిళలు, పిల్లలకు సేవచేసే అవకాశం రావడం నా పూర్వజన్మ సుకృతం.. ఇందుకు గర్వపడుతున్నా. జిల్లాకు సేవ చేయడంలో మా పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలతోపాటు ప్రతిపక్ష పార్టీల నాయకులు కూడా సహకరిస్తున్నారు. జిల్లా కలెక్టర్‌, ఎస్పీ, ఇతర అధికారులు ఇలా అందరి సమష్టి కృషి ఫలితమే మన కళ్లముందు కనిపించే అభివృద్ధి.

సాక్షి: నిరుద్యోగ సమస్య ఉంది.. పరిష్కార చర్యలేంటి?

మంత్రి: గిరిజనులు ఎక్కువగా ఉన్న జిల్లా మానుకోట. రాష్ట్రం వచ్చేనాటికి కనీస విద్య అందుబాటులో లేదు. అందుకోసమే చదువు మధ్యలో ఆపేవారు. ఉపాధి, ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేవారు. కానీ తెలంగాణ వచ్చిన తర్వాత చదువు చేరువైంది. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తే స్థానిక యువతకు ఉద్యోగాలు వస్తాయి. కానీ కేంద్ర ప్రభుత్వం విభజన చట్టం అమలు మరిచింది. అయినా జిల్లావాసిగా రూ.12కోట్లతో కేజీ నుంచి పీజీ వరకు గిరిజన బాలికలకు విద్యను అందించేందుకు గురుకులాలు మంజూరు చేయించా. వీటిలో విద్యతోపాటు, ఉపాధి మార్గం చూపించే కోర్సులు పెట్టాలని భావిస్తున్నాం. వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. దీంతో నిరుద్యోగ సమస్య కొంత మేరకు తీరే అవకాశం ఉంది. జిల్లాకు ఇంజనీరింగ్‌ కళాశాల మంజూరు చేయించా. దీంతో ఇంజనీరింగ్‌ విద్య అందుబాటులోకి వస్తుంది. అదేవిధంగా మల్యాలలో ఉద్యానవన పాలిటెక్నిక్‌ కళాశాల ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్‌ను కోరాను. త్వరలో పాలిటెక్నిక్‌ కళాశాల మంజూరుపై శుభవార్త వింటారు.

సాక్షి: బయ్యారం పెద్ద చెరువు, తులారాం ప్రాజెక్టుల ఊసేలేదు?

మంత్రి: రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఒక్కొక్కటిగా మెరుగుపరుస్తూ వస్తున్నాం. బయ్యారం పెద్ద చెరువును రిజర్వాయర్‌గా మారిస్తే ఈ ప్రాంత రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. రెండు పంటలు పండుతాయి. ఇందుకోసం సీతారామ ప్రాజెక్టు కాల్వను కలిపేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. తులారాం ప్రాజెక్టు విషయంపై నా చిన్నతనం నుంచి చర్చ జరుగుతుంది. అయితే ప్రస్తుతం ఉన్న నీటి వనరులు, ఆ ప్రాజెక్టు అవసరంపై నీటి పారుదల శాఖ అధికారులతో చర్చిస్తాం. ఆ ప్రాజెక్టు నిర్మాణంపై సీఎంతో మాట్లాడుతా.

సాక్షి: గిరిజన ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది కదా?

మంత్రి: మారుమూల గిరిజన ప్రాంతాల్లో కూడా మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించాలన్నదే మా ధ్యేయం. అయితే ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసినా.. అటవీశాఖ నుంచి క్లియరెన్స్‌ లేక రోడ్ల నిర్మాణాల్లో జాప్యం జరుగుతోంది. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు, ఫారెస్టు అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం.

సాక్షి: మీ రాజకీయ భవిష్యత్‌ ఏమిటి?

మంత్రి: నేను ఏనాడు ఇది కావాలని అడగలేదు. పార్టీ చెప్పిన పనులు చేసుకుంటూ వెళ్లా. ముఖ్యమంత్రి కేసీఆర్‌ ఆశీస్సులతో ఎమ్మెల్సీ, మంత్రి అయ్యాను. ఇక్కడ నా పనితనం రుజువు చేసుకుంటున్నా.. ఇక రాజకీయ భవిష్యత్‌ అంటారా.. మా అధినేత చెప్పిందే వేదం. నన్ను ఎక్కడి నుంచి పోటీ చేయమని చెబితే అక్కడి నుంచి పోటీ చేస్తా. వద్దంటే పార్టీకోసం, పార్టీ టికెట్‌ పొందిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తా.

ఆదివాసీ మూలాలను కాపాడుకోవాలి



మచ్చర్లలో పురాతన ఆదివాసీ వేల్పు దేవతలను గుర్తించిన పరిశోధకులు

గూడూరు: ఆదివాసీ మూలాలను కాపాడుకోవాలని పరిశోధన విద్యార్థి, తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మైపతి అరుణ్‌ కుమార్‌ అన్నారు. మండలంలోని మచ్చర్ల గ్రామంలో గురువారం బిర్సాముండా రీసెర్చ్‌ పరిశోధకులు పురాతన ఆదివాసీ వేల్పు దేవతలను గుర్తించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్‌ మాట్లాడుతూ.. మచ్చర్ల గ్రామంలో కొట్టెం వారి వేల్పు దేవుడి జాతర చరిత్రపై బిర్సాముండా రీసెర్చ్‌ సెంటర్‌ బృందం అధ్యయనం చేసిందని తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్‌ ట్రైబల్‌ అఫైర్స్‌ న్యూఢిల్లీ వారు పార్ట్‌ ఆఫ్‌ మేడారం కింద కమిషనర్‌ ఆఫ్‌ ట్రైబల్‌ వెల్ఫేర్‌ తెలంగాణ ఆధ్వర్యంలో 10 కోయ వేల్పు జాతరల చరిత్రపై పరిశోధనలు చేస్తున్నామన్నారు. ఏటూరునాగారం ఐటీడీఏ ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ పరిశోధనలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా మచ్చర్ల గ్రామ పెద్దలు, తలపతులు, వడ్డెలు, యువ ఉద్యోగస్తులతో చర్చించినట్లు బృందం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో బిర్సాముండా రీసెర్చ్‌ సెంటర్‌ ఇన్‌చార్జ్‌ కొమురం జ్యోతేశ్వర్‌, పరిశోధక విద్యార్థులు కాక శ్వేత, కాక నవ్య, పాయం నందిని, పోలెబోయి న రాకేష్‌, పెద్దలు కొట్టెం ఎల్లయ్య, నర్సయ్య, వజ్జయ్య, ఈసం పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

పోడు భూముల పరిశీలన

గార్ల: మండలంలోని సేరిపురం పంచాయతీలోని పోడు భూములను కలెక్టర్‌ శశాంక ఆదేశాల మేరకు గురువారం బయ్యారం ఎఫ్‌ఆర్వో రామ్మూర్తి పరిశీలించారు. జీపీలో 217 మంది పోడు పట్టాల కోసం దరఖాస్తు చేసుకుంటే 18 మంది రైతులకు మాత్రమే పట్టాలు మంజూరైనట్లు జాబితా విడుదల కావడంతో.. బుధవారం బాధిత గిరిజన రైతులు కలెక్టర్‌ శశాంకను కలిసిన విషయం విదితమే. కలెక్టర్‌ ఆదేశాల మేరకు అటవీ అధికారులు సేరిపురం పంచాయతీలో 30 ఏళ్లుగా గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములను పరిశీలించారు. తుది నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఎఫ్‌ఆర్వో రైతులకు తెలిపారు. ఎఫ్‌ఆర్వో వెంట బీట్‌ ఆఫీసర్‌ భిక్షపతి, సర్పంచ్‌ ధరావత్‌ సక్రు, బాధిత రైతులు ఉన్నారు.

సీఎం కేసీఆర్‌ పాలనకు జేజేలు



చెక్కులు అందజేస్తున్న మంత్రి దయాకర్‌రావు

పెద్దవంగర: పేదల అభ్యున్నతే లక్ష్యంగా పాలన సాగిస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రజలు జేజేలు పలుకుతున్నారని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని పడమటితండా గ్రామ పంచాయతీ పరిధి జయరాం తండాలో ఓ వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం పడమటితండాకు చెందిన బానోతు కోటికి రూ.25వేలు, లచ్చుకు రూ.25వేలు, చిరంజీవికి రూ.38 వేలు సీఎం రిలీఫ్‌ఫండ్‌ చెక్కులను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం అంటే ఏమిటో చేతల్లోచూపిన నేత సీఎం కేసీఆర్‌ చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు. సమావేశంలో సర్పంచ్‌ రాజేందర్‌, ఎంపీటీసీ విజయ, పాలకుర్తి దేవస్థాన చైర్మన్‌రామచంద్రయ్య శర్మ, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు ఐలయ్య, పీఏసీఎస్‌ తొర్రూరు మాజీ చైర్మన్‌ కేతిరెడ్డి సోమనర్సింహరెడ్డి, నాయకులు సంజయ్‌, సుధీర్‌, సోమన్న పాల్గొన్నారు.

వనదేవతలకు భక్తుల మొక్కులు



సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



పూజలు చేస్తున్న ఎంఎం నాయక్‌

ఎస్‌ఎస్‌ తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మ తల్లును దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గురువారం సమ్మక్క రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు జంపన్నవాగు వద్ద షవర్ల కింద స్నానాలు ఆచరించారు. అనంతరం అమ్మవార్ల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, చీరసారె, కానుకలు, ఎత్తుబంగారం సమర్పించారు. మొక్కుల అనంతరం భక్తులు మేడారం పరిసర ప్రాంతాల్లో విడిది చేసి వంటావార్పు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు. నేడు రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకల సందర్భంగా ఆలయంలో చేస్తున్న ఏర్పాట్లను ఈఓ రాజేంద్రం పరిశీలించారు.

ఏపీ ప్రిన్సిపల్‌ సెక్రటరీ నాయక్‌ పూజలు

ఆంధ్రప్రదేశ్‌ ప్రిన్సిపల్‌ సెక్రటరీ ఎంఎం నాయక్‌ కుటుంబ సమేతంగా అమ్మవార్ల దర్శించుకుని పూజలు చేశారు. ఆయనను ఆలయ సంప్రదాయ ప్రకారం డోలు వాయిద్యాలతో ఈఓ రాజేంద్రం, పూజారులు గద్దెల పైకి స్వాగతం పలికారు. అనంతరం సమ్మక్క సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్ద రాజులను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయనను పూజారులు పట్టు వస్త్రాలతో సన్మానించి అమ్మవార్ల బెల్లం ప్రసాదం అందజేశారు. ఆయన వెంట తహసీల్దార్‌ శ్రీనివాస్‌, ఎండోమెంట్‌ జూనియర్‌ అసిస్టెంట్లు రాజేశ్వర్‌రావు, బాలకృష్ణ ఉన్నారు.

హేమాచలుడికి శాంతి కల్యాణం



ఉత్సవ మూర్తులకు శాంతికల్యాణం జరిపిస్తున్న రాఘవాచార్యులు

మంగపేట: మండల పరిధిలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో లక్ష్మీనర్సింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి దేవతా మూర్తులకు ఆలయ అర్చకులు గురువారం శాంతి కల్యాణం నిర్వహించారు. స్వామివారి జన్మదిన స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామివారు అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు యాగశాలలో ఆలయ ప్రధాన పూజారి కైకర్యం రాఘవాచార్యులు శాంతికల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు ఏడునూతుల ఈశ్వర్‌చంద్‌ రామానుజం, అనిపెద్ది మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి

- కలెక్టర్‌ శశాంక



కురవి: అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్‌

కురవి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఈనెల 3న రైతు వేదికల్లో రైతు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్‌ శశాంక అన్నారు. గురువారం మండలంలోని నేరడ గ్రామంలోని రైతు వేదికను పరిశీలించారు. వ్యవసాయ శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతీ రైతు వేదికను తోరణాలతో అలంకరించాలని సూచించారు. వేసవికాలం దృష్ట్యా అన్ని రైతు వేదికల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతీ రైతు వేదికలో ఏర్పాట్లను ఏఈఓలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు భోజనాలను ఏర్పాటు చేసే స్థలాలను పరిశీలించి పలు సలహాలు, సూచనలిచ్చారు. కార్యక్రమంలో డీఏఓ ఛత్రునాయక్‌, ఏడీఏ, ఏఓ మంజుఖాన్‌, జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి, సర్పంచ్‌ గుండోజు శ్రీనివాసాచారి, ఏఈఓ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన..

బయ్యారం: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఈ నెల 3న నిర్వహించనున్న రైతు దినోత్సవ ఏర్పాట్లను కలెక్టర్‌ శశాంక గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్ల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్‌ మాట్లాడుతూ...దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రైతు వేదికను సుందరంగా అలంకరించడంతో పాటు రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్‌ బిందు,డీఏఓ ఛత్రునాయక్‌, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, తహసీల్దార్‌ రమేష్‌, వైస్‌ ఎంపీపీ గణేష్‌, సొసైటీ చైర్మన్‌ మధుకర్‌రెడ్డి, కో–ఆప్షన్‌సభ్యులు బాబా, ఏఓ రాంజీ, ఆర్‌ఎస్‌ఎస్‌ జిల్లా కమిటీ సభ్యుడు సోమిరెడ్డి, బయ్యారం కో–ఆర్డినేటర్‌ రవీందర్‌రెడ్డి, ఏఈఓ సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు చేయాలి

మహబూబాబాద్‌ రూరల్‌: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 3న రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌ శశాంక అధికారులను ఆదేశించారు. మహబూబాబాద్‌ మండలం జంగిలిగొండ గ్రామంలోని రైతు వేదికలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్‌ మాట్లాడారు. రైతు వేదికను అందంగా ముస్తాబు చేయాలన్నారు. ఆ రోజున భోజనాల ఏర్పాట్లు చేసే స్థలాలను పరిశీలించి అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ సాయిలు, ఎంపీపీ మౌనిక, డీఏఓ ఛత్రునాయక్‌, ఏడీఏ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏఓ తిరుపతిరెడ్డి, ఏఈఓలు, పంచాయతీ కార్యదర్శులు, బీఆర్‌ఎస్‌ గ్రామఅధ్యక్షుడు కొమురెల్లి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను వైభవంగా నిర్వహించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

మరిపెడ రూరల్‌: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను వైభవంగా నిర్వహించుకోవాలని హైదరాబాద్‌ హాకా చైర్మన్‌ మచ్చ శ్రీనివాసరావు అన్నారు. మరిపెడ మండలం గిరిజపురం రైతు వేదికలో ఈ నెల 3న రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం అదనపు కలెక్టర్‌ అభిలాష అభినవ్‌ ఆధ్వర్యంలో మండలస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని వివరించారు. ప్రతీ గ్రామంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టి విజయవంతం చేయాలన్నారు. శనివారం నిర్వహించే రైతు దినోత్సవంలో వ్యవసాయ రంగంలో సాధించి న విజయాలు,నాణ్యమైన ఉచిత కరెంట్‌,రైతు బీమా, రైతుబంధు తదితర పథకాలను రైతులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మరిపెడ పీఏ సీఎస్‌ చైర్మన్‌ చాపల యాదగిరిరెడ్డి, తహసీల్దార్‌ పిల్లి రాంప్రసాద్‌, ఎంపీడీఓ కేలోతు ధన్‌సింగ్‌, ఏఓ వీరసింగ్‌,బీఆర్‌ఎస్‌ నాయకులు శాస్త్రి,స్థానిక స ర్పంచ్‌ జనార్దన్‌,ఏఈఓలు,కార్యదర్శులు పాల్గొన్నారు.

'అవతరణ' వేడుకలకు ఏర్పాట్లు

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, జంక్షన్లను విద్యుత్‌ దీపాలతో అలంకరించారు. జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి 22వ తేదీ వరకు దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు.

– సాక్షి, మహబూబాబాద్‌



విద్యుత్‌ వెలుగుల్లో కాంతులీనుతున్న కలెక్టరేట్‌

క్లుప్తంగా

చాక్‌పీస్‌పై అమరవీరుల స్తూపం



నిఖిల్

చాక్‌పీస్‌పై చెక్కిన అమరవీరుల స్తూపం

కేసముద్రం: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మండలంలోని అమీనాపురం గ్రామానికి చెందిన లింగాల నిఖిల్ అనే సూక్ష్మ కళాకారుడు చాక్‌పీస్‌పై తెలంగాణ అమరవీరుల స్తూపాన్ని అద్భుతంగా చెక్కాడు. మొత్తంగా 40 నిమిషాల్లో చాక్‌పీస్‌పై కళాఖండాన్ని చెక్కినట్లు నిఖిల్ తెలిపాడు.

నష్కల్ రామాలయంలో చోరీ



వాగులో పడేసిన హుండీ

చిల్పూరు: మండలంలోని నష్కల్ గ్రామంలోని కాకతీయుల కాలంలో నిర్మించిన శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దొంగలు గోడ దూకి ఆలయ తలుపుల తాళాలు పగుల గొట్టి లోనికి వెళ్లారు. అక్కడ బీరువాలో ఉన్న మంగళ సూత్రాలతో పాటు హుండీని ఎత్తుకెళ్లి పక్కనే ఉన్న వాగు వద్ద హుండీని పగుల గొట్టి అందులో ఉన్న నగదును ఎత్తుకెళ్లారు. హుండీని నీటిలో పడేశారు. గురువారం ఉదయం అర్చకుడు గుడిని శుభ్రం చేసేందుకు వెళ్లగా తాళాలు పగుల గొట్టి ఉండడంతో సర్పంచ్ కర్ణకంటి స్వప్నవెంకటేష్, ఎంపీటీసీ పాశం శిరీష సురేష్‌లకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకుని ఎస్సై వినయ్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు చుట్టుపక్కల వెతుకగా హుండీ నీళ్లలో కనిపించింది. కేసు నమోదు చేసి ఆలయ చుట్టు పక్కల సీసీకెమెరాలను పరిశీలిస్తున్నారు.

ద్విచక్రవాహనంలో మంటలు

గూడూరు: ఎండ తీవ్రతతో ద్విచక్రవాహనం ముందు భాగంలో మంటలు చెలరేగిన ఘటన గూడూరు మండలం వద్దెరగూడెం శివారు భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో గురువారం జరిగింది. పెట్రోల్ బంక్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. గుండెంగ గ్రామానికి చెందిన బోడ రవీందర్, అతని మిత్రుడు కలిసి బొల్లెపల్లి నుంచి గూడూరుకు వెళ్లేందుకు సమీప భారత్ పెట్రోల్ బంక్ ఏరియా ప్రాంతానికి చేరుకున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో అక్కడికి చేరుకున్న ద్విచక్రవాహనం ముందు భాగంలో మంటలు రావడం గుర్తించిన ఇద్దరు వ్యక్తులు వెంటనే వాహనం నిలిపి అరిచారు. వారి అరుపులు విన్న పెట్రోల్ బంక్ సిబ్బంది బంక్‌లో ఉన్న కార్బన్‌డై ఆక్సైడ్ సాయంతో మంటలు ఆర్పారు.

దైవ దర్శనానికి వెళ్తూ..

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు
- ముగ్గురి మృతి, ఇద్దరి పరిస్థితి విషమం
- తిరుపతి, శ్రీకాళహస్తి మార్గంలో ఘటన
- దంతాలపల్లిలో విషాదఛాయలు



వెంకటమ్మ, అశోక్, సాన్విత్రాక్షరి(ఫైల్)



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

దంతాలపల్లి: అల్లుడి పుట్టెంటికలు తీసేందుకు సంతోషంగా తిరుపతికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం కుటుంబ సభ్యులతో కబుర్లు చెప్పుకుంటూ మార్గమధ్యలో శ్రీకాళహస్తి దైవక్షేత్రానికి దర్శించుకోవడానికి కారులో వెళ్తున్నారు. ఇంతలోనే ఘోరం జరిగింది. రెప్పపాటులో కారు ఆర్టీసీ బస్సును ఢీకొనటంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా ఇద్దరి పరిస్థితి విషమం కాగా, ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన తిరుపతి శ్రీకాళహస్తి మార్గమధ్యలో కాగా మృతులు మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రానికి చెందిన వారు. వివరాలిలా ఉన్నాయి.. దంతాలపల్లి మండల కేంద్రానికి చెందిన నెమ్మది లింగయ్య, వెంకటమ్మ దంపతులకు ముగ్గురు కొడుకులు వెంకన్న, రాంబాబు, అశోక్ కూతురు రేణుక ఉన్నారు. లింగయ్య వివిధ కారణాలతో 25 సంవత్సరాల క్రితం చనిపోగా వెంకటమ్మ తన పిల్లలను కష్టపడి పెంచి చదివించింది. పెద్ద కొడుకు వెంకన్న, రెండో కొడుకు రాంబాబు ఇద్దరూ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. పెద్ద కొడుకు వెంకన్న, జ్యోతి దంపతులకు ఇద్దరు కూమార్తెలు, ఒక బాబు ఉన్నారు. వెంకటమ్మ తన కూతురు రేణుకను నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన ప్రవీణ్‌కు ఇచ్చి వివాహం చేసింది. ఆ దంపతుల కుమారుడు దెవాన్స్(3)కు పుట్టెంటికలు తీసేందుకు అన్నలను మంగళవారం తిరుపతికి రావాల్సిందిగా కోరింది. దీంతో తల్లి వెంకటమ్మ, వెంకన్న ఇద్దరి కూతుళ్లు బాన్విత్రాక్షరి, సాన్విత్రాక్షరిని తీసుకొని కారులో బయలుదేరి తిరుపతికి వెళ్లారు. దైవదర్శనం అనంతరం అందరూ తలనీలాలు ఇచ్చి దారిలో శ్రీకాళహస్తి దర్శించుకొని ఇంటికి వస్తామని వస్తుండగా తిరుపతి, కాళహస్తి రహదారిపై ఏర్పేడు మండలం మేర్లపాక చెరువు సమీపంలో కారు, ఆర్టీసీ బస్సును ఢీ కొట్టింది. దీంతో నెమ్మది వెంకటమ్మ(60), చిన్నకొడుకు అశోక్ (32), మనుమరాలు సాన్విత్రాక్షరి(5) అక్కడికక్కడే మృతి చెందగా మరో పాప బాన్విత్రాక్షరి, తండ్రి వెంకన్న విషమస్థితిలో ఉండగా తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనతో దంతాలపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

మావోయిస్టు కొరియర్ల అరెస్ట్

- పేలుడు పదార్థాలు స్వాధీనం



అరెస్ట్ వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

వెంకటాపురం(కె): వాజేడు మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామ సమీపంలో బుధవారం రాత్రి మావోయిస్టు కొరియర్లను పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. గురువారం వెంకటాపురం పోలీస్‌స్టేషన్‌లో సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. వాజేడు మండలంలో జరుగుతున్న రోడ్డు పనులకు సంబంధించిన యంత్రాలను తగులబెట్టి, అక్కడికి వచ్చే పోలీసులను హత మార్చాలని ల్యాండ్ మైన్స్ అమర్చుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు వెంకటాపురం సీఐ శివ ప్రసాద్, వాజేడు ఎస్సై అశోక్‌ల ఆధ్వర్యంలో వాజేడు మండలం గుమ్మడిదొడ్డి గ్రామ సమీపంలో బుధవారం రాత్రి 9 గంటల సమయంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులతో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. కాగా వాజేడు గ్రామశివారులోని కల్వర్టు సమీపంలో ముగ్గురు వ్యక్తులు సైకిల్ మీద ఒక బస్తా, పెట్రోల్ టిన్‌తో గుమ్మడిదొడ్డి వైపు నుంచి వాజేడు వస్తున్నారు. ఆ ముగ్గురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోతుండగా పోలీసులు వెంబడించి పట్టుకుని విచారించగా వాజేడు మండలం ప్రగల్లపల్లి గ్రామానికి చెందిన పుల్లూరి నాగరాజు, ఏటూరు నాగారం మండలానికి చెందిన వావిలాల నర్సింగ రావు, ఏంపెల్లి జాషువాలు గత కొంత కాలంగా మావోయిస్టు కొరియర్లుగా పనిచేస్తున్నట్లు తెలిపారు. పట్టుకున్న వారి వద్ద నుంచి పేలుగు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. వీరు మావోయిస్టులకు కావాల్సిన నిత్యావసర సరుకులు, మందులు సప్లై చేస్తూ కాంట్రాక్టను బెదిరించి పార్టీకి ఫండ్ సమకూర్చుతున్నట్లు తెలిపారు. వాజేడు రోడ్డు వర్క్‌కు సంబంధించిన యంత్రాలను తగులబెట్టేందుకు వస్తూ పోలీసులకు పట్టుబడినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి ఐదు మీటర్ల కార్డెక్స్ వైర్, డిటోనేటర్, పెట్రోల్ టిన్, రెండు బ్యాటరీలు, పది మీటర్ల ఎలక్ట్రికల్ వైర్, టిఫిన్ బాక్స్, మోటర్ సైకిల్, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్ట్ చేసిన వ్యక్తులను రిమాండ్ పంపించనున్నట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో వెంకటాపురం ఎస్సై తిరుపతి రావు, వాజేడు ఎస్సై అశోక్ తదితరులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు కార్మికుడి మృతి



చంద్రశేఖర్(ఫైల్)

వరంగల్ అర్బన్: విద్యుత్ స్తంభం ఎక్కి లైట్‌ను తొలగిస్తున్న క్రమంలో ఓ ఔట్ సోర్సింగ్ కార్మికుడు ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రేటర్ వరంగల్ ఎలక్ట్రికల్ విభాగంలో ఔట్ సోర్సింగ్ కార్మికుడు ఇమ్మడి చంద్రశేఖర్(49) విధులు నిర్వహిస్తున్నాడు. హన్మకొండ 56వ డివిజన్ గోపాల్‌పూర్ సురేంద్రపురి కాలనీలో విద్యుత్ స్తంభంపైన వీధిలైటు వెలగడం లేదని ఫిర్యాదు మేరకు చంద్రశేఖర్ విద్యుత్ లైటు తొలగించేందుకు స్తంభాన్ని ఎక్కాడు. ఈ క్రమంలో ప్రమాద వశాత్తు కింద పడిపోవడంతో తలకు, వెన్నుముఖకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గతంలో 20 ఇళ్ల పాటు బీమారం గ్రామపంచాయతీలో విద్యుత్ కార్మికుడిగా పనిచేయగా, 2013లో నగరంలో విలీనమైంది. బీమారంలో నివాసం ఉంటున్న చంద్రశేఖర్‌కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

మృతుడి కుటుంబ సభ్యులను ఆదుకుంటాం: మేయర్, కమిషనర్

మృతుడి కుటుంబ సభ్యులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని మహానగర పాలక సంస్థ మేయర్ గుండు సుధారాణి తెలిపారు. గురువారం వరంగల్ ఎంజీఎం మార్చురీకి వెళ్లి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను మేయర్, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాలు పరామర్శించి ఓదార్చారు. బల్దియా తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని, మృతుడి కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగం ఇస్తామని పేర్కొన్నారు. బల్దియా తరపున అంత్యక్రియలకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. మేయర్, కమిషనర్ వెంట కార్పొరేటర్ సిరంగి సునీల్ కుమార్, ఇన్‌చార్జ్ ఈఈ సంజయ్ కుమార్, ఏఈ సరిత తదితరులు ఉన్నారు.

విద్యుత్ తీగలు పట్టుకుని యువకుడు..



భాష (ఫైల్)

కాశిబుగ్గ: మద్యం మత్తులో ఓ యువకుడు హైపవర్ విద్యుత్ తీగలు పట్టుకుని మృతి చెందిన ఘటన వరంగల్ రైల్వే స్టేషన్‌లో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా పెదకాకాని పాతూరుకు చెందిన షేక్ ఇసూబు భాష (17) స్వీట్స్ షాప్‌లో వర్కర్‌గా పని చేస్తుంటాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో భాష అతని మిత్రుడు విజయవాడకు వెళ్లేందుకు గుంటూరులో రైలు ఎక్కి నిద్రపోయే సరికి రైలు విజయవాడ దాటి రావడంతో వరంగల్‌లో దిగారు. దిగిన అనంతరం బయటకు వెళ్లి మద్యం సేవించి విజయవాడకు వెళ్లేందుకు బుధవారం రాత్రి 11.30 గంటల సమయంలో స్టేషన్‌కు వస్తుండగా దారిలో వేరే వారితో గొడవ జరిగింది. ఈ క్రమంలో వారిని బెదిరించేందుకు క్షణికావేశంలో భాష రైల్వే స్టేషన్‌లోని మొదటి ప్లాట్‌ఫాంపై నిలిచి ఉన్న ఆయిల్ ట్యాంకర్ ఎక్కి హైపవర్ విద్యుత్ తీగలను పట్టుకున్నాడు. దీంతో విద్యుత్‌షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టమార్టం నిర్వహించి మృతుడి తల్లి మస్తానీకి అప్పగించామని పోలీసులు తెలిపారు.

సాగు భూమి ఇప్పించాలని నిరసన



పెట్రోల్‌తో నిరసన వ్యక్తం చేస్తున్న దళిత మహిళ

చిన్నగూడూరు: 30ఏళ్లగా సాగు చేసుకుంటున్న తన భూమిని తనకు ఇప్పించాలని దళిత మహిళ పెట్రోల్‌తో నిరసన వ్యక్తి చేసింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలంలో చోటు చేసుకుంది. బాధితురాలు మద్దెల యాదమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నగూడూరు నుంచి జయ్యారం వెళ్లే ప్రధాన రహదారి వెంబడి ఉన్న పట్టా సాగుభూమి (సర్వే నెంబర్ 129)ని అధికారులు, ప్రజాప్రతినిధులు లాక్కోని అక్రమంగా డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మిస్తున్నారని ఆరోపించారు. తన కొడుకుకు రూ.10 లక్షలు ఇచ్చి భూమి కొన్నామంటూ స్థానిక లీడర్లు చెప్పుతున్నారని, తన పేరున ఉన్న భూమిని నా ప్రమేయం లేకుండా ఎలా కొంటారంటూ బాధితురాలు తెలుపుతున్నారు. తనకు సర్వే నెంబర్ 129లో 4 ఎకరాల భూమిలో రాళ్లు రప్పలు తీసి చదును చే శానని అందులో ఎకరం భూమిని నా భర్త జ్ఞాపకార్థం పోలీస్ స్టేషన్‌కు ఇచ్చానన్నారు. ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఇవ్వమన్నాడని బీఆర్ఎస్ నాయకులు దౌర్జన్యంగా తన భూమిని ఆక్రమించారని ఆరోపించారు. నా భర్త అనారోగ్యం రీత్యా రూ. 20 లక్షలు అప్పు చేసిన ఫలితం లేదన్నారు. చేసిన అప్పులకు నెలనెలా వడ్డీలు కడుతూ జీవనం సాగిస్తున్నాను. ఇప్పుడు అన్యాయంగా నా భూమిని ఆక్రమించారంటూ కన్నీరుమున్నీరయ్యారు. నా భూమి నాకు ఇప్పించాలని అధికారులను వేడుకుంటున్నట్లు కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం భర్త సమాధిపై రోదిస్తున్న తీరుతో స్థానికులు కలత చెందారు.

ద్విచక్ర వాహనం, లారీ ఢీ

- వ్యక్తికి తీవ్రగాయాలు



క్షతగాత్రుడు మధు

మామునూరు: వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై రోడ్డు పక్కనే పార్కింగ్ చేసిన లారీని వెనక వైపు బలంగా బైక్ ఢీకొట్టడంతో ఓ తాపిమేస్త్రికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం తెలిసిన వెంటనే ఎస్సై రాజేష్‌రెడ్డితో కలిసి ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని స్థానికుల సహకారంతో 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన గురువారం మామునూరు శివారు రామకిష్టాపురం బస్‌స్టాప్ సమీపంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పెరుమాండ్లగూడెంకు చెందిన కావటి మధు(35) తాపీమేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వ్యక్తిగత పని మీద మధు బైక్‌పై గురువారం వరంగల్ నగరానికి బయలుదేరాడు. ఈ క్రమంలో ఖమ్మం జాతీయ రహదారిపై రామకిష్టాపురం బస్‌స్టాప్ సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక వైపు బైక్‌తో బలంగా ఢీకొట్టడంతో మధుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం తెలిసిన ఎస్సై రాజేష్‌రెడ్డితో కలిసి ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. వెంటనే క్షతగాత్రుడిని ఎంజీఎంకి తరలించారు.

గంజాయి తరలింపు కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న సీఐ

నెల్లికుదురు: ఎండు గంజాయి కేసులో ఏవన్ నిందితుడు రూ.6 లక్షల విలువ చేసే గంజాయితో పట్టుబడినట్లు తొర్రూర్ సీఐ సత్యనారాయణ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. మండలంలోని బోటిమాది తండా గ్రామ పంచాయతీకి చెందిన జాటోతు సునిల్ మరో ముగ్గురుకు కలిసి రూ.30లక్షల విలువచేసే ఎండు గంజాయితో పట్టుపడగా ఏవన్ నిందితుడు జాటోతు సునిల్ పారిపోయినట్లు తెలిపారు. నమ్మదగని సమాచారంతో బోటిమీదితండాలోని సునిల్ ఇంటికి వెళ్లిసోదాలు చేయగా రూ.6లక్షల విలువ చేసే 30 కిలోల గంజాయిని తరలించేందుకు యత్నిస్తుండగా పట్టుకుని గంజాయిని స్వాధీనం చేసుకుని సునిల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్సై క్రాంతి కిరణ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

హత్యాయత్నం కేసు నమోదు



క్షతగాత్రుడు రామచంద్రు (ఫైల్)

గార్ల: తండ్రి కొడుకులపై కత్తి, రాళ్లతో దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై హత్యాయత్నం కేసు నమోదైన సంఘటన ఇందిరానగర్‌తండాలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై బానోత్ వెంకన్న కథనం ప్రకారం.. గార్ల మండలం సత్యనారాయణపురం పంచాయతీ ఇందిరానగర్‌తండాకు చెందిన భూక్యా రమేష్ అతని చెల్లెలి మధ్య గొడవ కావడంతో చెల్లెలు భయపడి అదే గ్రామానికి చెందిన ఇస్లావత్ రామచంద్రు ఇంటివైపు తలదాచుకునేందుకు వెళ్లింది. మా చెల్లెలికి ఎందుకు మీ ఇంట్లో షెల్టర్ ఇచ్చావంటూ రమేష్ అతడి స్నేహితుడు రాకేష్‌తో కలిసి రామచంద్రు అతని కొడుకు విజయ్‌లపై కత్తి, రాళ్లతో దాడిచేశారు. ఈ దాడిలో రామచంద్రు తలకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి చిన్న కుమారుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు రమేష్, రాకేష్‌లపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సీఎం కప్ పోటీల్లో విషాద ఘటన

- హ్యాండ్‌బాల్ క్రీడాకారుడికి విరిగిన చేయి



విజయ్ (ఫైల్)

వరంగల్ స్పోర్ట్స్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల్లో వరంగల్ జిల్లా హ్యాండ్‌బాల్ జట్టుకు విషాద ఘటన ఎదురైంది. ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో వరంగల్ నగరంలోని పైడిపల్లికి చెందిన జన్ను విజయ్ జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించాడు. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో హైదరాబాద్ వర్సెస్ వరంగల్ జట్లు సెమీ ఫైనల్‌లో తలపడుతుండగా విజయ్ కిందపడిపోయాడు. నొప్పి భరించలేని విజయ్ గట్టిగా కేకలు వేయడంతో అక్కడే ఉన్న రెఫరీ, తోటి క్రీడాకారుల సాయంతో లఖడీకపూల్‌లోని గ్లోబల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఎడమ చేయి మణికట్టు, మోచేయి మధ్యలో ఎముక విరిగినట్లు గుర్తించి సర్జరీ చేశారు. ప్రస్తుతం విజయ్ ఆరోగ్యంగానే ఉన్నట్లుగా స్నేహితులు తెలిపారు. ఎక్కడ హ్యాండ్‌బాల్ పోటీలు జరిగిన విజయ్ పతకాల సాధన కోసం ప్రత్యర్థులకు తీవ్ర పోటీని ఇస్తాడని, ఇలా జరగడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. విజయ్ చేయి విరిగిందని తెలుసుకున్న తల్లిదండ్రులు విజయ, దేవదాస్‌లు విలవిలలాడిపోయారు.

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఉత్సవాలు

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి



మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

పాలకుర్తి: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం దశాబ్ది ఉత్సవాలను ప్రతి పల్లెలో పండుగలా నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం పాలకుర్తిలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన జనగామ, వరంగల్, మహబూబూబాద్ జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జూన్ 2న నుంచి 22 వరకు నిర్వహించే ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో చేయబోతున్న కార్యక్రమాలను మంత్రి ప్రకటించారు. 22వ తేదీ వరకు చేయబోతున్న కార్యక్రమాలను వివరించారు. సమీక్ష సమావేశంలో జనగామ కలెక్టర్ శివలింగయ్య, డీసీపీ సీతారాం, డీఆర్‌డీఓ రాంరెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ప్రకటించాలి



ఆత్మీయ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న రెడ్డి సంఘాల ఐక్య వేదిక నాయకులు

- ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి

మడికొండ: చట్టబద్ధతతో కూడిన రెడ్డి కార్పొరేషన్‌ను ప్రకటించాలని రెడ్డి కార్పొరేషన్ ఐక్య క్యాచరణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రెడ్ల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనేక సంవత్సరాలుగా నిరుపేద రెడ్ల హక్కుల గురించి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనల ఫలితంగా 2018లో బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిందన్నా రు. సీఎం కేసీఆర్ కూడా ప్రెస్‌మీట్‌పెట్టి చెప్పడాని, నాలుగున్నరేళ్లయినా అమలు కాకపోవడంతో రెడ్ల ఐక్య కార్యాచరణ ద్వారా ఉద్యమిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్‌లో రెడ్డి కార్పొరేషన్ సాధనకు పోరాడుతున్న సభ్యులను అభినందించారు. బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మారెడ్డి మాట్లాడుతూ రెడ్డి అంటే కులం కాదని గుణం అని పేర్కొన్నారు. నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్లలో ఐక్యత ఉందని చాటిచెప్పడానికి ఆత్మీయ సమ్మేళనమే నిదర్శనమన్నారు. రెడ్డి కార్పొరేషన్ సాధనకు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి సాధిస్తామన్నారు. అనంతరం ఐక్య కార్యాచరణ సమితి పది డిమాండ్లను ప్రకటించింది. రూ.5వేల కోట్లతో చట్టబద్ధతతో కూడిన రెడ్డి కార్పొరేషన్ ప్రకటించాలి. విదేశీ విద్యానిధి పథకాన్ని ప్రతి విద్యార్థికి అందించాలి. రాష్ట్రంలోని 36 జనరల్ గురుకులాలను వందకు పెంచాలి. ప్రతి రైతుకు ఐదు లక్షల వరకు హెల్త్‌కార్డు ఇవ్వాలి. రాష్ట్ర రాజధానిలో రెడ్డి సంక్షేమ భవనానికి ఐదు ఎకరాల భూమి కేటాయించి నిర్మాణానికి రూ.10కోట్లు కేటాయించాలి. రిజర్వేషన్లను పూర్తి స్థాయిలో అమలు చేయాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సబ్సిడీలు పేద రెడ్లకు వర్తింపచేయాలి. విద్యా, ఉద్యోగాల్లో వయోపరిమితి, కటాఫ్ మార్కులను సడలించాలి. రైతు బీమా పథకాన్ని వయసుతో నిమిత్తం లేకుండా వర్తింపజేయాలి. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలనే డిమాండ్‌లను ప్రకటించారు. ఈ సమ్మేళనంలో 'కుడా' మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, రెడ్డి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర నాయకులు బద్దూరి వెంకటేశ్వర్ రెడ్డి, పైళ్ల హరినాథరెడ్డి, నల్ల సంజీవరెడ్డి, డీకే వసంత రెడ్డి, చందుపట్ల నరసింహారెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి, కూచన రవళిరెడ్డి, రెంటాల కేశవ రెడ్డి, రామిడి రామిరెడ్డి, రావుల నర్సింహారెడ్డి, బిల్లా సుధీర్‌రెడ్డి, పాపిరెడ్డి, కటంగూరి రామ్‌గోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, పాపిరెడ్డి పాల్గొన్నారు.

'వసూళ్ల టార్గెట్'పై ఆగ్రహం

- ఫిర్యాదు అందితే టౌన్ ప్లానింగ్ ఉద్యోగులపై కఠిన చర్యలు
- సర్వేయర్ల లైసెన్స్ రద్దు చేసి క్రిమినల్ కేసులు పెడుతాం
- ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను నిర్లక్ష్యం చేయొద్దు
- హెచ్చరించిన మేయర్, కమిషనర్
- గ్రేటర్ వరంగల్‌లో వాడీవేడిగా సమీక్ష సమావేశం



సమావేశంలో మేయర్ సుధారాణి, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్ అర్బన్ : అనుమతి లేని, అతిక్రమణ భవన నిర్మాణాల యాజమానుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ షేక్ రిజ్వాన్ పాషా సిబ్బందిని హెచ్చరించారు. 'వసూళ్లే టార్గెట్' శీర్షికన ఈనెల 29న 'సాక్షి' ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో గురువారం బల్దియాలో జరిగిన సమావేశం వాడీవేడిగా జరిగింది. ఈ సందర్భంగా చైన్‌మెన్‌లు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, లైసెన్స్ సర్వేయర్ల అవినీతిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భవన నిర్మాణదారుల నుంచి ఫిర్యాదులు అందితే టౌన్ ప్లానింగ్ సిబ్బంది, చైన్‌మెన్లను సస్పెండ్ చేస్తానని, సర్వేయర్ల లైసెన్స్ రద్దు చేసి క్రిమినల్ కేసులు పెడతామని మందలించారు. ఫిజికల్ వెరిఫికేషన్ సిబ్బంది తీరు మార్చుకోవాలని చెప్పారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుకు డబ్బులు అడిగే సర్వేయర్లపై చర్యలు తప్పావని, అనధికార లేఔట్లు, నిర్మాణాలు జరుగకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు. ఇందుకు సంబంధించి అక్రమ నిర్మాణాలు ఉంటే అధికారులకు తెలియజేసి ప్రాథమిక దశలోనే తొలగించాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు నాల బఫర్ జోన్లలో నిర్మాణాలు జరగకుండా చూడాలని చెప్పారు.

ఈనెల చివరి నాటికి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలి

గ్రేటర్ పరిధిలో ప్లాట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్)కు సుమారు లక్ష దరఖాస్తులు వచ్చాయని ఈ నెలాఖరు నాటికి ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఇందుకు 42 మంది ప్రొఫెషనల్ సర్వేర్‌యర్లను నియమించుకుని, రోజూ ఒక్కొక్కరు కనీసం 35 దరఖాస్తులను పరిశీలించాలని చెప్పారు. టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు, వారి పరిధిలోని సర్వేయర్ల పనితీరుపై నిత్యం పర్యవేక్షిస్తూ ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. భవన నిర్మాణానికి టీఎస్–బీపాస్‌లో దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా నిర్ణీత 21 రోజుల గడువులో అనుమతులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. మొత్తం 11,616 దరఖాస్తులు రాగా 11,208 భవన నిర్మాణాలకు మంజూరు, వివిధ కారణాలతో 408 తిరస్కరించినట్లు వివరించారు.

శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చివేయండి

గ్రేటర్ పరిధిలో శిథిలావస్థకు చేరిన భవనాలు 404 ఉన్నట్లు గుర్తించామని ఇందులో 211 గృహాలను తొలగించామన్నారు. మిగిలిన వాటిని తక్షణమే తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో సిటీ ప్లానర్ వెంకన్న డిప్యూటీ కమిషనర్లు శ్రీనివాస్‌రెడ్డి జోనా, ప్లానింగ్ అధికారులు, టీపీఎస్‌లో టీపీబీఓలు, ఇరిగేషన్ అధికారులు, చైన్ మెన్లు పాల్గొన్నారు. అంతకు ముందు గ్రేటర్ వరంగల్ పరిధిలోని నయింనగర్ నాలాలను, ప్రెసిడెన్సీ స్కూల్ వద్ద నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను, పలు డివిజన్‌లలో పారిశుద్ధ్య నిర్వహణ, టీఎస్ బిపాస్ క్రింద భవన నిర్మాణ అనుమతుల నిమిత్తం స్థలాలను కమిషనర్ సందర్శించారు. ఆయన వెంట సీపీ వెంకన్న, సీఎం హెచ్ఓ రాజేష్, ఎస్ఈ కృష్ణారావు, ఈఈ రాజయ్య, డీఈ రవికుమార్ తదితరులు ఉన్నారు.